# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ త్వరలో జరగబోయే 2027 జనగణన ప్రక్రియకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.
- ❖ ప్రతి కుటుంబానికి 25 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించేలా "యూనివర్సల్ హెల్త్ స్కీమ్"ను అమలు చేయబోతున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.
- ❖ గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న అన్ని దేవాలయాలను గోదావరి పుష్కరాలకు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.
- ❖ కోస్తాంధ్రప్రదేశ్, రాయలసీమలో రాగల 7 రోజుల్లో వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

రాష్ట్రంలో జరగబోయే 2027 జనగణన ప్రక్రియకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని ప్రభుత్వం కోరింది. 1948 జనగణన చట్టం ప్రకారం ప్రజల విధులు, బాధ్యతలను స్పష్టంగా తెలియజేస్తూ... రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 12న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జనగణన నిర్వహణ కోసం వచ్చే సిబ్బందికి ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని ప్రభుత్వం సూచించింది. నిబంధనల ప్రకారం జనగణన సిబ్బందికి ప్రశ్నలు అడిగే అధికారం ఉందని, వారు కోరిన సమాచారాన్ని సరైన విధంగా అందించాలని తెలిపింది. అలాగే.. సెన్సస్ అధికారులు అడిగే ప్రశ్నలకు సరైన సమాచారాన్ని ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొంది. తప్పుడు సమాచారం ఇస్తే.. చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. సెన్సస్ చట్టం 1948 ప్రకారం నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించనున్నట్లు వెల్లడించింది. జనగణన ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావాలంటే ప్రజల సహకారం అత్యంత కీలకమని ప్రభుత్వం పేర్కొంది.

====================

రాజమహేంద్రవరంతో పాటు గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న అన్ని దేవాలయాలను గోదావరి పుష్కరాలకు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మహదేవుని సత్రంలో పుష్కరాల సందర్భంగా 9 కోట్ల 55 లక్షల రూపాయలతో ఆరు అభివృద్ధి పనులకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే ఏడాది జూన్ 26 నుంచి గోదావరి మహా పుష్కరాలు ప్రారంభమవుతాయని చెప్పారు. పుష్కరాల కోసం గోదావరి పరివాహక ప్రాంతానికి చెందిన 12 మంది మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే 43 దేవాలయాల పున: నిర్మాణం కోసం 51 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

====================

పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. విశాఖపట్నంలోని చెస్ట్ ఆసుపత్రిలో ఎండో బ్రాంకియల్ అల్ట్రా సౌండ్ మెషీన్ ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో వైద్య రంగం గత రెండేళ్లలో అద్భుతమైన వృద్ధిని సాధించిందని, ఆసుపత్రుల్లో ఓపి, ఐపి సేవలు గణనీయంగా పెరిగాయన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నామని, కర్నూలు, విశాఖపట్నం, కడప, గుంటూరులలో అత్యాధునిక క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి కాకినాడ, అనంతపురంలో కూడా కాంప్రహెన్సివ్ క్యాన్సర్ సెంటర్లను పూర్తి చేసి క్యాన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా కృషి చేస్తామన్నారు. త్వరలోనే ప్రతి కుటుంబానికి 25 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించేలా "యూనివర్సల్ హెల్త్ స్కీమ్"ను అమలు చేయబోతున్నామని మంత్రి వెల్లడించారు.

====================

మహిళా రిజర్వేషన్ చట్టం దేశ చరిత్రలో ఒక గొప్ప అడుగు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ తెలిపారు. విజయవాడలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... ఈనెల 16, 17, 18వ తేదీల్లో పార్లమెంట్‌లో జరిగే చర్చల్లో చట్ట సభల్లో మహిళా బిల్లు ఆమోదం పొందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 2029 నాటికి మహిళా బిల్లు పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుందన్నారు. చట్టసభల్లో మహిళా బిల్లు ఆమోదం పొందేందుకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

విరామం

====================

జూలై నెలకు సంబంధించిన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆర్జిత సేవా టికెట్ల కోటాను ఈనెల 18న ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 21న ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు, శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేస్తారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికీ ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి తెలిపింది. అలాగే ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టిటిడి కోరింది.

====================

ప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే మృతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా సినిమా రంగానికి ఆశా భోంస్లే చేసిన సేవలను కొనియాడారు. ప్రముఖ గాయని ఆశా భోంస్లే మరణవార్త విని తీవ్రంగా విచారించానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఆమె పాడిన పాటలు తరతరాలను సుసంపన్నం చేశాయన్నారు. ఆశాజీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఆశా భోంస్లే భౌతికంగా మనకు దూరమైనా... ఆమె పాట రూపంలో జీవించే ఉంటారని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కీర్తించారు.

====================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను రేపు రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌లో అన్ని మండలాల తహశీల్దార్లు, ఆర్డీవోలు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులను meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

====================

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం పన్నెడా గ్రామానికి చెందిన ముగ్గురు నీటిలో మునిగి మృతి చెందారు. ఐదుగురు బాలురు మత్స్యగెడ్డలో ఈత కొట్టేందుకు వెళ్లారు. వీరిలో నలుగురు ప్రమాదవశాత్తు మునిగిపోగా.. మరొకరు బయటకు వచ్చి సహాయం కోసం కేకలు వేశారు. సమీపంలోని మత్స్యకారులు తక్షణమే స్పందించి.. ఒకరిని కాపాడగలిగారు. మిగిలిన ముగ్గురూ మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

====================

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో రేపు, ఎల్లుండి పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. కోస్తాంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమలో రాగల 7 రోజుల్లో వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని తెలిపారు. రానున్న 5 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 3 డిగ్రీలు క్రమంగా పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.

====================

ఐపీఎల్-2026లో భాగంగా లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనకు దిగిన గుజరాత్ 8 ఓవర్లు పూర్తయ్యే సరికి ఒక వికెట్ నష్టపోయి 69 పరుగులు చేసింది. మరోవైపు ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఈరోజు రాత్రి జరగనున్న రెండో మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ జట్లు తలపడనున్నాయి.

====================
====================